# నైతికానైతికం

ఉమా మహేష్ ఆచాళ్ల
98493 03247

కథ

ఉదయం పది గంటలవుతున్నది. చుట్టూ పేరుకున్న పుట్టను లెక్కచేయని తపోమునిలా.. కుట్టే దోమల్ని కొట్టుకోకుండా మరీ చదువుతున్నాడు శ్రీకర్. గుడ్డు పొదిగినా, పగిలినా సంబంధం లేని గూడులా ఉందా హాస్టల్ రూము. తల పైన తిరగని ఫ్యాను, తల్లోంచి కారే చెమట.. పట్టించుకునే స్థితిలో లేడతను. ఫోన్ వైబ్రేట్ అవడంతో ఎత్తి..

''ఆ డాడీ చెప్పు!'' అన్నాడు చదువుతూనే.

''నాన్నా! ఈరోజే లాస్ట్ ఎగ్జామ్ కదా. జాగ్రత్తగా రాసి సాయంత్రం బయల్దేరి వచ్చేయ్. రాత్రి కాసేపైనా పడుకున్నావా? బ్రేక్‌ఫాస్ట్ ఏమైనా తిన్నావా? స్నానం చేసి దేవుడికి దండం పెట్టుకుని వెళ్లు నాన్నా!'' అవతల్నించి శంకర్రావు ఆదుర్దాగా మాట్లాడుతున్నాడు.

''ఇది ఇంజినీరింగ్ నాన్నా. ఎగ్జామ్స్‌లో టైంకి తినడం, రాత్రుళ్లు పడుకోవడం కుదరదు. అన్నీ ఇంటికొచ్చాకే! స్నానం కూడా సాయంత్రమే. ఉంటాను నాన్నా.. టైం అవుతున్నది. ఇంకా ఓ చాప్టర్ చదవాలి. బై!'' అంటూ ఫోన్ పెట్టేసి, అలవాటు ప్రకారం ఇంకా చదవాల్సిన చాప్టర్ హెడ్డింగ్ చేతిమీద రాసుకుని.. ఎలాగూ బ్రేక్ వచ్చిందని మంచం మీదనించి లేచి ఒళ్లు విరుచుకుని, రూమ్‌లో అటూ ఇటూ పచార్లు చేయసాగాడు.

రాతి గోడలు చూస్తే అతనికి ప్రొఫెసర్ సభాపతి గుర్తొచ్చాడు. కోరుకున్న కొండ ఎక్కుతున్నప్పుడు కాళ్లల్లో రాయి గుచ్చుకున్నట్టు.. ఫస్ట్ ఇయర్‌లో అతనితో వివాదం గుర్తొచ్చింది. అతను ఏదో తప్పు చెప్పాడనిపించి, కొత్త కావడంతో అత్యుత్సాహం కొద్దీ లేచి కరెక్ట్ చెయ్యడంతో.. అతను అఫెండ్ అవడం, ఆ తర్వాత అసైన్మెంట్ సబ్మిట్ చేస్తే బైటికి విసిరేయడం, తను రివ్యూకి అప్లయి చేసి మార్కులు పొందడం, దాంతో అతను మరింత కోపం పెంచుకోవడం.. అవన్నీ ఇప్పుడు తలుచుకుంటే నవ్వొస్తున్నది. తనదే పొరపాటు. సభాపతి కోపిష్టి అనీ, శాడిస్ట్ అనీ క్లాసురూమ్‌లోనేకాదు స్టాఫ్‌రూమ్‌లోనూ టాక్ ఉంది. ఒక్క సెమిస్టరు తలొంచుకుంటే సరిపోయేది. ఇప్పటికీ తను ఎదురైతే కాల్చేసేలా చూస్తాడు.

'ఎగ్జామ్ అయిపోగానే.. ఊరెళ్లేలోపు ఓసారి ఆయన్ని కలిసి సారీ చెప్పాలి' అనుకున్నాక.. మనసు కాస్త తేలికపడి, తిరిగి చదువులో పడిపోయాడు.

* * *

మధ్యాన్నం మూడు. ఎగ్జామ్ హాల్ నిశ్శబ్దంగా ఉంది. ఫైనల్ సెమిస్టర్ ఆఖరి పేపర్. రాత్రంతా కష్టపడి చదివినందుకు తలెత్తకుండా రాస్తున్నాడు శ్రీకర్. ఈ ఒక్క ఎగ్జామ్ అయిపోతే డిగ్రీ చేతికొస్తుంది. ప్లేస్‌మెంట్ వచ్చేసింది కాబట్టి.. ఓ నెలలో జాయిన్ అయిపోవచ్చు. అతనికి ఆ క్షణం అమ్ములు గుర్తొచ్చి బుగ్గలు ఎరుపెక్కాయి.

'బావా! నాకు ఈ ఇంజినీరింగ్ ఎక్కదు. హాయిగా హ్యుమానిటీస్ చదువుకుంటా! నీకు పాతిక, నాకు రెండు తక్కువ దాటకుండా పెళ్లి చేసుకుందాం' అంటుంది అల్లరిగా.. చెల్లెలు పోవడంతో మేనకోడలి బాధ్యత శంకర్రావే చూస్తున్నాడు.

మరొక్క అయిదు నిమిషాల్లో ఆన్సర్ పేపర్ ఇచ్చేసి రూమ్‌కెళ్లి బట్టలు సర్దుకుని స్టేషన్‌కు వెళ్లాలి. ఆఖరి ప్రశ్నకు చకచకా రాస్తూ ఉండగా.. కుందేలు మీద లారీ టైరు ఎక్కినట్టు, సీతాకోకచిలుక మీద ఇటుక లోడు దించినట్టు.. అతని లేత భుజం మీద ఇనుప దిమ్మ లాంటి ఓ చెయ్యి బలంగా పడింది. తుళ్లిపడి, నొప్పితో తలెత్తి చూశాడు.

సభాపతి. ఒక్కసారిగా శ్రీకర్ చేతిలో పేపర్ లాక్కుని, అతని చెయ్యి లాగిపట్టుకుని, దాని పక్కనే శ్రీకర్ ఐడీ కార్డు పెట్టి, తన ఫోన్లో ఫొటో తియ్యడం.. ఆపై శ్రీకర్‌ను కాలర్ పట్టుకుని బయటికి లాక్కెళ్లడం.. ఇదంతా ఒక్క నిమిషంలో, శ్రీకర్ తేరుకునేలోపే జరిగిపోయింది.

''సర్ సర్! ఏం జరిగింది సర్? నన్ను ఎక్కడికి తీసుకెళ్తున్నారు సర్!'' అంటూ భయంగా అడుగుతున్నాడు శ్రీకర్.

ఇన్విజిలేటర్ జూనియర్ కావడంతో సభాపతిని ఏమీ అనలేకపోయాడు.

''కాపీ కొడతావురా! పదరా ప్రిన్సిపాల్ దగ్గరికి. నీ సంగతి తేలుస్తాను'' అంటూ రొప్పుతూ, శ్రీకర్‌ని లాక్కుని వెళ్తున్నాడు సభాపతి.

''సర్ నేను కాపీ చెయ్యడం ఏంటి సర్!? అలాంటిదేం లేదు సర్. మీరు పొరబడుతున్నారు సర్!'' అంటూ చటుక్కున వంగి ఆయన కాళ్లు పట్టుకున్నాడు శ్రీకర్.

అంతే! ఆ హఠాత్ చర్యకు ఒక్కసారిగా తూలిపడ్డాడు సభాపతి. లేచి..

''రాస్కెల్! నా మీదే చెయ్యి చేసుకుంటావా?'' అంటూ మరింత స్పీడ్‌గా డీన్ రూమ్‌కు

